క్లుప్తంగా

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

అనపర్తి: మండలంలోని అనపర్తి, కుతుకులూరు, కొప్పవరం గ్రామ పంచాయతీల పరిధిలో ఖాళీగా ఉన్న 6 గ్రామ వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ బీఎల్ నరసింహం తెలిపారు. వాటిని రిజర్వేషన్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడంతో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శికి అందజేయాలని ఎంపీడీఓ సూచించారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట



ఎలుకల నివారణ మందు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులకు ఉచితంగా ఎలుకల నివారణ మందు పంపిణీ చేశారు. రామవరంలో గ్రామ సర్పంచ్ గిరడా గంగాభవాని ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తోందన్నారు. వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది సూచనలు పాటించి రైతులు ఎలుకలను నివారించుకోవాలని చెప్పారు. కార్యక్రమాల్లో సబ్బెళ్ల నాగిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, సత్తి దొరయ్యరెడ్డి, చిర్ల వీరవెంకటరెడ్డి పాల్గొన్నారు.


575 మందికి వైద్యసేవలు



చినకొండేపూడిలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: చినకొండేపూడి గ్రామ సచివాలయం -2లో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 575 మందికి డాక్టర్ రాజు వైద్యసేవలు అందించారు. గ్రామంలో మంచంపై ఉన్న రోగుల ఇంటికి నేరుగా వెళ్లి చికిత్స చేశారు. జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. ఇళ్ల వద్ద నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాల శుభ్రతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని విద్యార్థులను కోరారు. అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ అరుణ, ఏఎన్‌ఎం కృష్ణవేణి, ఆశవర్కర్లు నాగమణి, దేవి పాల్గొన్నారు.

నాణేలతో తులాభారం



బాబా ఆలయంలో నాణేలతో వేస్తున్న తులాభారం

బిక్కవోలు: రాయవరం గ్రామానికి చెందిన తెలకరాపు వెంకట శ్రీనివాస్, మంగా దేవి దంపతులు తమ కుమారుడు మురళీ ఆనంద్‌కు ఎంబీబీఎస్ సీటు వస్తే తులాభారం ఇస్తామని బాబాకు మొక్కుకున్నారు. ఆనంద్‌కు సీటు రావడంతో పాటు ఎంబీబీఎస్ పూర్తయింది. దీంతో మంగళవారం బలభద్రపురం ఆంధ్రా షిర్డీ సాయి ఆలయంలో అతడిని నాణేలతో తులాభారం వేసి మొక్కు చెల్లించుకున్నారు. తులాభారంగా 80 కిలోల నాణేలు వచ్చాయని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ళ పురుషోత్తమరెడ్డి తెలిపారు.

దేవస్థానం పాలక మండలి సభ్యుల నియామకం



కృష్ణవీర సుబ్బలక్ష్మి



రజనీరెడ్డి

రాజానగరం/మధురపూడి: దేవస్థానం పాలక మండలి సభ్యులుగా నియోజకవర్గానికి చెందిన ఇద్దరు నియమితులయ్యారు. రాజానగరం మండలం పాలచర్లకు చెందిన జిల్లా ఆర్యవైశ్య సంఘం పొలిటికల్ కమిటీ చైర్మన్ నాళం రోశయ్య సతీమణి కృష్ణ వీరసుబ్బలక్ష్మిని ద్వారకా తిరుమల దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబరుగా నియమించారు. అలాగే కోరుకొండకు చెందిన ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ కర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి భార్య రజనీరెడ్డి అన్నవరం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులుగా నియమితులయ్యారు.

ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా జగన్ పాలన

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- పందలపాకలో గడప గడపకూ మన ప్రభుత్వం



పందలపాకలో స్థానికులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పందలపాకలో నాలుగో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయాల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. జగనన్న అందిస్తున్న పథకాలను చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలతో పబ్బం గడుపుతున్నాయని దుయ్యబట్టారు. సంక్షేమ, అభివృద్ధి పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగనన్న కావాలో, కేవలం ముఖ్యమంత్రి పీఠం మీద మోజుపడ్డ చంద్రబాబు కావాలో ఆలోచించుకోవాలన్నారు. కార్యక్రమంలోని జిల్లా మహిళా సంక్షేమ సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీలు కర్రి గీతా సావిత్రి, మచ్చా పాప, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కిలపర్తి సత్యనారాయణ, జేసీఎస్ మండల కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, కర్రి ఇసరా రెడ్డి, గండి వాసు, కొంకుదురు పీహెచ్‌సీ కమిటీ సభ్యుడు యాసలపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా పని చేయాలి

- జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గోకవరంలో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పని చేయాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. స్థానిక సూర్య ఫంక్షన్ హాలులో మంగళవారం మండల సచివాలయ కన్వీనర్ దాసరి రమేష్ ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలోని అన్ని వర్గాలకు చెందిన అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ వ్యవస్థ ఇంకా పటిష్టంగా అమలు చేసేందుకు, ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తోడ్పాటు నందించాలన్నారు. అనంతరం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు వారి విధి విధానాలపై రామచంద్రాపురం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు ఒమ్మి రఘురాం శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు దాసరి తమ్మున్నదొర, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, సుంకర వీరబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గుల్లా ఏడుకొండలు, కర్రి సూరారెడ్డి, దాసరి సతీష్‌బాబు, తుమ్మల చిన్నబ్బు, నరాలశెట్టి నర్శయ్య, తోలేటి రాంప్రసాద్, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ నాగేశ్వర్
- తొర్రేడులో గడప గడపకూ



తొర్రేడులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న నియోజకవర్గ కో ఆర్డినేటర్ నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథి అని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. తొర్రేడు గ్రామ సచివాలయం-1 పరిధిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పార్టీ శ్రేణులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి 380 కుటుంబాలను చందన నాగేశ్వర్ కలిశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వీధిలైట్లు, రోడ్లు , డ్రైనేజీలు తదితర సమస్యలను స్థానికులు వివరించగా, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి సీతాపతికి సూచించారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో అర్హుల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు చేరుతున్నాయన్నారు. పార్టీ నాయకులు ఉప్పులూరి రాంబాబు (రాము), సొసైటీ చైర్ పర్సన్ చిట్టూరి వెంకటరావు, సభ్యులు దండుమూడి అర్జునరావు, గద్దె సుబ్బారావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కొత్తపల్లి కేశవ రామారావు, మిరియం నెహ్రూ, మెప్పెల్లి రాజు, మంగం శేఖర్ బాబు, బోడదాసి రాహుల్, గద్దె శ్రీనివాస్ చౌదరి పాల్గొన్నారు.

కేంద్ర ఎన్‌ఎల్‌ఎం సర్వే టీం సభ్యుల పర్యటన



సింగంపల్లిలో పథకాల అమలు తీరును పరిశీలిస్తున్న కేంద్ర సర్వే టీం సభ్యులు

రంగంపేట: మండలంలోని వీరంపాలెం, వెంకటాపురం, సింగంపల్లి, మర్రిపూడి తదితర గ్రామాల్లో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి నేషనల్ లెవెల్ మోనటరింగ్ టీం(ఎన్‌ఎల్‌ఎం) సభ్యులు విజయరాజు, పైడిరాజులు సోమ, మంగళవారాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరును వారు పరిశీలించారు. అనంతరం సచివాలయాల్లో సమావేశాలు నిర్వహించి విద్య, వైద్యం, ఐసీడీఎస్, వెలుగు, ఉపాధిహామీ తదితర పథకాలపై ఆయా శాఖల అధికారుల నుంచి వివరాలు సేకరించారు. తాము తయారు చేసిన రిపోర్టును ఉన్నతాధికారులకు పంపిస్తామని సర్వే టీం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, ఎంపీడీఓ శ్రీరామరాజు, ఏపీఓ వెంకటేశ్వర్లు, మండల ఇంజినీరింగ్ అధికారి సీహెచ్ రాము, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికుమార్, సర్పంచ్ తుట్టా శివశంకర్‌ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యదేవునికి పుష్పయాగం

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన శ్రీసూర్యనారాయణమూర్తి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి చివరి రోజు స్వామికి ఘనంగా పుష్పయాగం నిర్వహించారు. అద్దాల శయన మందిరంలో ఉయ్యాల సేవలతో స్వామివారి పుష్పయాగం అత్యంత వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ కొవ్వూరి గాయత్రి, ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొవ్వూరి శ్రీనివాసబాలకృష్ణారెడ్డి, ద్వారంపూడి వెంకటరెడ్డి, నల్లమిల్లి సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, కొవ్వూరి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ బోల్తా

గోకవరం: వీరలంకపల్లి గ్రామ శివారున మంగళవారం టిప్పర్ లారీ బోల్తా పడింది. వివరాల ప్రకారం.. వీరలంకపల్లి గ్రామ శివారున ప్రధాన రహదారిపై రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డుపై నీరు వేసేందుకు వచ్చిన టిప్పర్ లారీకి బ్రేకులు ఫెయిల్ అయ్యి అదుపు తప్పి పడిపోయింది. ప్రమాదంలో డ్రైవర్ సల్పగాయాలతో బయటపడ్డాడు.

నేడు గడప గడపకూ..

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో ఐదో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు సత్తి హరి ప్రసాద్‌రెడ్డి మంగళవారం తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 1 గంటకు ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల్ని వివరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

చురుగ్గా పైపులైన్ పనులు

సీతానగరం: ఉండేశ్వరపురం జగనన్న లేఅవుట్‌లో వాటర్ పైపులైన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వి.అవినాష్ తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి నీటి వసతి కోసం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు విన్నవించారని, ఆయన కలెక్టర్‌తో సంప్రదించి రూ. 5 లక్షల నిధులు మంజూరు చేయించారన్నారు. దీంతో పైపులైన్ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు.

రైతులు విధిగా ఈ పంట నమోదు చేయించుకోవాలి

గోకవరం: రబీ సాగు చేస్తున్న రైతులు విధిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి పి.రాజరాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఈకేవైసీ ద్వారా సాగు విస్తీర్ణం , సర్వే నంబర్లు సరిచూసుకోవాలన్నారు. మండలంలోని 1780 మంది రైతులు రబీలో 6,120 ఎకరాల్లో మొక్కజొన్న, నువ్వులు, అపరాలు సాగు చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు కేవలం 926 మంది మాత్రమే రైతులు ఈకేవైసీ నమోదు చేశారని, మిగిలిన రైతులు ఈనెల 20 నాటికి పూర్తి చేసుకోవాలన్నారు. లేకపోతే ధాన్యం అమ్మకాలకు, పంట ధ్రువీకరణ పత్రాలు పొందడానికి వీలుండదన్నారు.

విద్యతోనే సామాజిక అభివృద్ధి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



అనపర్తిలో పాఠశాల అభివృద్ధి పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: విద్యతోనే సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. నాడు-నేడు రెండో ఫేజ్ 2లో భాగంగా స్థానిక ఐఎల్‌టీడీ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సుమారు రూ.23.71 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న అదనపు గదుల నిర్మాణ పనులకు, సుమారు రూ.15.74 లక్షలతో చేపట్టే పాఠశాల సుందరీకరణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో వివిధ సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు విద్యార్థుల భవితకు బాటలు వేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, రెడ్డి కార్పొరేషన్, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్లు సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, ఎంపీటీసీ తుమ్మా రాజేశ్వరి సత్తిబాబు, ఉప సర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, పీఎంసీ చైర్మన్ ఎస్.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి



పైన గ్రామంలో రీసర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ రమణ

పెదపూడి: జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష రీ సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని కాకినాడ ఆర్డీఓ బీవీ రమణ అన్నారు. మండలంలో పైన, రాజుపాలెం గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను ఆర్డీఓ రమణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 11 గ్రామాల్లో రీసర్వే జరుగుతుందన్నారు. ఇప్పటివరకూ మండలంలో 7,698 భూహక్కు పత్రాలు పంపిణీ చేశామని చెప్పారు. నిబంధనల ప్రకారం అధికారులు రీసర్వే చేపట్టాలని సూచించారు. కాకినాడ డివిజన్‌లో సుమారు 62 వేల భూ హక్కు పత్రాల పంపిణీకి చర్యలు తీసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ తాడి సుభాష్, ఆర్ఐ త్రివేణి, వీఆర్వో పంపన శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో సమూల మార్పులు



ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు

అనపర్తి: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ కేంద్రాలకు మంచి రోజులొచ్చాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. రాయవరం, రంగంపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఆయా గ్రామాల పరిధిలో నూతనంగా ఎంపికైన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మారుస్తుందన్నారు. నూతనంగా ఎంపికైన వారు నిబంధనలకు అనుగుణంగా బాధ్యతతో పనిచేస్తూ ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ బిక్కవోలు మండల కన్వీనర్ పోతుల ప్రసాద రెడ్డి, సర్పంచ్‌లు సత్యంశెట్టి వెంకటరమణ, బుంగ రామారావు తదితరులు పాల్గొన్నారు.

10న బోధవ్యాధి నివారణ మాత్రల పంపిణీ



మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ రవికుమార్

రాజానగరం: జాతీయ బోధ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 10న వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఆ వ్యాధి నివారణ మాత్రలు పంపిణీ చేస్తారని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టి.రవికుమార్ తెలిపారు. పీహెచ్‌సీలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాత్రలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయడంతో పాటు ప్రతి స్కూల్‌కి వెళ్లి విద్యార్థులకు అందజేయాలన్నారు. వీటితో పాటు నులిపురుగుల నివారణకు ఆల్బెండ్‌జోల్ మాత్రలు కూడా ఇవ్వాలన్నారు. ఏ వయసు వారికి ఏడోసు వేయాలో వివరించారు. సమావేశంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, డీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

మధురపూడి: కోటికేశవరం, దోసకాయలపల్లి పీహెచ్‌సీల్లో డాక్టర్లు రవిచంద్ర, పుణ్యశాంతి, కోటేశ్వరరావు మంగళవారం వైద్య సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బోధ నివారణ మందుల పంపిణీలో అత్యంత శ్రద్ధను కనబర్చాలని కోరారు. వీటిని గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇవ్వకూడదన్నారు. రెండేళ్లు పైబడిన చిన్నారులతో మాత్రమే మింగించాలన్నారు.

నాయీబ్రాహ్మణుల గౌరవాన్ని పెంచిన జగన్



రాజానగరంలో సీఎం జగన్ చిత్రపటం వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న నాయీబ్రాహ్మణులు

రాజానగరం: రాష్ట్రంలో దేవాలయ పాలకమండళ్లలో నాయీ బ్రాహ్మణులకు కూడా అవకాశం కల్పించి, తమ గౌరవాన్ని పెంచారని ధన్వంతరి నాయీబ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గోపాలకృష్ణ అన్నారు. నాటి సీఎం చంద్రబాబు కేశఖండనశాలలో ఉద్యోగ భద్రత కోరితే పిలిచి తోకలు కత్తిరిస్తా, గుడి మెట్లు కూడా ఎక్కనివ్వనంటూ అవమానించారంటూ గత చేదు అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కానీ నేడు సీఎం జగన్ రాష్ట్రంలోని 610 దేవాలయాలలో తమ వారిని కూడా ట్రస్టు బోర్డు మెంబర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమన్నారు. ఆయన ఇచ్చిన పిలుపు మేరకు రాజానగరంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో మండలంలోని ధన్వంతరి నాయీబ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. తొలుత గాంధీ మహాత్ముని విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు యేలేటి మల్లేశ్వరరావు, పపలసూడి ప్రకాష్, అచ్చన్న, పోశారావు, భీమేశ్వరరావు, శివప్రసాద్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

అనపర్తి: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని జిల్లా చైల్డ్ లైన్-1098 కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం అనపర్తి శివారు కొత్తూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో జీవితాలు నాశనమవుతాయన్నారు. బాలల హక్కులకు భంగం కలిగించినా, బాల్య వివాహాలు జరుగుతున్నా వాటిని నిలుపుదల చేయాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాలలపై లైంగిక దాడులు, హింస, దోపిడీ, వేధింపులు, నిర్లక్ష్యానికి సంబంధించిన సమాచారాన్ని చైల్డ్ లైన్ 1098కు కాల్ చేసి అందించాలని సూచించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ జీ.విజయ్, ఏఎస్ఐ టి.వీర్రాజు, డాక్టర్ ఎం.రవికుమార్, చైల్డ్‌లైన్ సిబ్బంది జె.సత్యనారాయణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు




భువనేశ్వరిని అభినందిస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య అశోక్

రాజానగరం: దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే పెరేడ్‌లో పాల్గొని, చక్కని ప్రతిభను కనబర్చడంతోపాటు ప్రముఖులందరినీ కలిసి వచ్చిన విద్యార్థిని (ఎస్‌కేఆర్ ఉమెన్స్ కాలేజీ) యర్రా భువనేశ్వరిని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ అభినందించారు. ఆ విద్యార్థిని మంగళవారం యూనివర్సిటీలో రిజిస్ట్రార్‌ను కలిసింది.

9న సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ

రాజానగరం: ముక్కినాడలో నూతనంగా నిర్మించిన షిరిడీ సాయిబాబా మందిరంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆ గ్రామానికి చెందిన ఎల్ఐసీ విశ్రాంత అధికారి అనదాన శేషయ్య కుటుంబ సభ్యులు నిర్మించిన ఈ మందిరంలో గురువారం ఉదయం 8 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుంది. ఇందులో భాగంగా చేపట్టే మూడు రోజుల పూజాకార్యక్రమాలను వినాయకుడి పూజతో మంగళవారం ప్రారంభించారు. మొదటి రోజు రక్షా బంధనం, అఖండ దీపారాధన, నవగ్రహారాధన, మండప సంస్కారాలు చేసి, ప్రతిష్ఠ చేసే విగ్రహాలకు ధాన్యాదివాసం, జలాదివాసం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుల ఆధ్వర్యంలో హోమాలు జరిగాయి.

ఆధార్ సేవలు



కాపవరం సచివాలయంలో ఆధార్ శిబిరం

మధురపూడి: ప్రతి ఒక్కరూ ఆధార్ అనుసంధానం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుకొండ ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని కాపవరం సచివాలయంలో ఆధార్ క్యాంపు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 10 వరకూ సంబంధిత సచివాలయాల్లో ఆధార్ సేవలు అందజేస్తారన్నారు.